క్లుప్తంగా

ప్రగతి గౌడ సంఘం నూతన కమిటీ


ప్రకాశరావుపాలెంలో నూతనంగా ఏర్పాటైన గౌడ సంఘం

నల్లజర్ల: మండలంలోని ప్రకాశరావుపాలెంలో ప్రగతి గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. గౌరవాధ్యక్షుడిగా శెనగన సతీష్‌గౌడ్, అధ్యక్షుడిగా రాసమళ్ల శ్రీను, ఉపాధ్యక్షుడిగా బొల్లా దుర్గాప్రసాద్, కార్యదర్శిగా పిల్లి కనకరాజు, కోశాధికారిగా కొనకళ్ల సుబ్రమణ్యం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాసమళ్ల శ్రీను మాట్లాడుతూ, గౌడ కులస్తులంతా తమ పిల్లల్ని విద్యావంతుల్ని చేయాలన్నారు. సామాజికంగాను, ఆర్థికంగాను, రాజకీయంగాను ఎదగాలని ఆకాంక్షించారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

దేవరపల్లి: వివిధ అంశాలపై చర్చించేందుకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ వై.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ దుర్గారావు అధ్యక్షత వహిస్తారని చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ


వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

దేవరపల్లి: స్నేహితుల దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక జైకిసాన్ వృద్ధాశ్రమంలో యర్నగూడెం జెడ్పీ హైస్కూలు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సభ్యులు పండ్లు పంపిణీ చేశారు. సొసైటీ ద్వారా వివిధ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సొసైటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పెదిరాజు, కోరం ఆంజనేయులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులంతా రేపు విజయవాడకు తరలిరావాలి

నిడదవోలు రూరల్: రాష్ట్రవ్యాప్తంగా సర్పంచుల సమస్యలపై మంగళవారం విజయవాడలో చేపట్టే నిరసన కార్యక్రమానికి సర్పంచులంతా తరలిరావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు, కంసాలిపాలెం సర్పంచ్ కొండపల్లి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఏడు నెలల క్రితం విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు తక్షణమే పంచాయతీలకు జమ చేయాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయానికి కంప్యూటర్లు, స్మార్ట్ టీవీ అందజేత


గ్రంథాలయానికి కంప్యూటర్లు, స్మార్ట్ టీవీ అందజేస్తున్న ప్రతినిధులు

తాళ్లపూడి: బెంగళూరుకు చెందిన శివశ్రీ చారిటబుల్ ట్రస్ట్, శిక్షణ ఫౌండేషన్ వారు స్థానిక శాఖా గ్రంథాలయానికి రెండు కంప్యూటర్లు, స్మార్ట్ టీవీ, మొబైల్ ఫోన్ అందజేశారు. గ్రంథాలయాధికారికి సంస్థ ప్రతినిధి డి.సత్యనారాయణ ద్వారా ఆదివారం వీటిని అందజేశారు. డిజిటల్ లైబ్రరీని ప్రోత్సహించడానికి వీటిని అందజేసినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ ముదయ్, బాబులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి సమృద్ధిగా కేంద్రం నిధులు

గోపాలపురం: దేశంలో ఏ రాష్ట్రానికీ అందించనన్ని నిధులు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీకి మంజూరు చేస్తున్నట్టు బీజేపీ జిల్లా కార్యదర్శి గెల్లా శ్రీనుబాబు అన్నారు. కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులను కోరారు. దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకా తిరుమల, గోపాలపురం మండలాల పార్టీ నాయకులతో ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన సమావేశం నిర్వహించారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నిడదవోలు: వాకర్స్ క్లబ్, వనిత వాకర్స్ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో జాగృతి కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి లయన్ సేవారత్న రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో 50 మందికి ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు భాస్కర్ల రామ్మోహన్‌రాయ్, దారపురెడ్డి ప్రతాప్, గొల్లకోటి రాజేష్, అమర శ్రీలక్ష్మి, వెంకట రమణమ్మ, షేక్ రేష్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టని మూగ రోదన

- పశు వైద్యశాలల్లో సమస్యల తిష్ట
- వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీ
- శిథిలావస్థలో చాగల్లు ఆస్పత్రి భవనం
- పశువులకు వైద్య సేవలు అంతంతమాత్రం


చాగల్లులో శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాల


భవనంలో పెచ్చులు ఊడిపడుతున్న శ్లాబ్

చాగల్లు: పశువుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశు వైద్యశాలలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో పశువైద్య భవనాల్లో కనీస వసతులు దారుణంగా ఉన్నాయి. శిథిలావస్థలో ఉన్న భవనాలను చూసి పాడి రైతులు పెదవి విరుస్తున్నారు. వైద్యులతో పాటు, గ్రామాల్లో పని చేసే వెటర్నరీ అసిస్టెంట్లకు ఇతర శాఖలకు సంబంధించిన అదనపు బాధ్యతలు అప్పగించడంతో.. పశు వైద్యశాలల్లో పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వైద్యం కోసం తమ పశువులను ఆస్పత్రులకు తీసుకువెళ్లిన రైతులు గంటల కొద్దీ తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

కొవ్వూరు నియోజకవర్గంలో కొవ్వూరు, దొమ్మేరు, పశివేదల, వాడపల్లి, తాళ్లపూడి, అన్నదేవరపేట, చాగల్లు, కలవలపల్లి గ్రామాల్లో పశు వైద్యశాలలు ఉన్నాయి. కుమారుదేవం, మలకపల్లి, గోపవరం గ్రామీణ పశు వైద్యశాలలు కొనసాగుతున్నాయి. తాళ్లపూడిలో పశు వైద్యశాలకు సొంత భవనం లేకపోవడంతో రేకుల షెడ్డులోనే కొనసాగిస్తున్నారు. దీనివల్ల పశువులకు వైద్య సేవలు అందించడానికి కూడా సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొవ్వూరు మండలంలో దొమ్మేరు పశు వైద్యశాల భవనం శిథిలావస్థలో ఉండటంతో, అక్కడ ఆర్‌బీకేలోనే వైద్య సేవలు అందిస్తున్నారు. దొమ్మేరు వైద్యశాలలో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది.

శిథిలావస్థ భవనంలో..

కొవ్వూరు నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో పశు వైద్యశాలలు శిథిలావస్థలోనే కొనసాగుతున్నాయి. వాటిని పట్టించుకునే నాథుడే లేడు. చాగల్లులో పశువైద్య కేంద్ర భవనం శ్లాబ్ పాడవ్వడంతో వర్షపు నీరు లీకేజీ అవుతోంది. గోడలు బీటలువారి దయనీయ స్థితిలో దర్శనమిస్తోంది. శిథిలావస్థలో ఉన్న ఆస్పత్రిలోనే సేవలు కొనసాగిస్తున్నారు. మండల కేంద్రమైన చాగల్లులోని పశు వైద్యశాలకు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాడి రైతులు తమ పశువులను మెరుగైన వైద్య సేవలకు ఇక్కడికే తీసుకువస్తారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

పశు వైద్యశాలల్లో వైద్యులు, సిబ్బంది కొరతతో పశు పోషకులు, పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో మండల కేంద్రం చాగల్లు, కలవలపల్లి ఆస్పత్రుల్లో మాత్రం సిబ్బందిని కేటాయించకపోవడంతో వైద్య సేవలకు ఆటంకం కలుగుతోంది. చాగల్లు పశు వైద్యశాలలో వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు, కలవలపల్లి పశు వైద్యశాలలో వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా ఆస్పత్రుల్లో వైద్యులు ఒక్కరే అందుబాటులో ఉండటంతో, పశువులను ఆస్పత్రికి తీసుకువచ్చి గంటలకొద్దీ పడిగాపులు పడాల్సి వస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. చాగల్లు, కలవలపల్లి పశు వైద్య కేంద్రాల పరిధిలో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు సుమారు పది వేల వరకు న్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి, ఆస్పత్రుల వద్ద పూర్తి మౌలిక సదుపాయాలు కల్పించాలని పశు పోషకులు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి



పశు వైద్యశాలలో సిబ్బంది కొరత వల్ల అవస్థలు పడుతున్నాం. పశువులను ఆస్పత్రికి తీసుకువచ్చి గంటలకొద్దీ పడిగాపులు పడాల్సి వస్తుంది. వెంటనే ఆస్పత్రుల్లో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలి.

– గారపాటి వెంకట సుబ్బారావు, రైతు సంఘం నాయకుడు, చాగల్లు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పశువైద్య కేంద్రంలో ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆస్పత్రి శిథిలావస్థకు చేరింది. పలు మార్లు పెచ్చులూడి పడిపోయాయి. పశు వైద్యశాలలో సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే.

– డాక్టర్ ముఖేష్, పశు వైద్యాధికారి, చాగల్లు

23న యోగా జిల్లా జట్టు ఎంపిక

యోగా సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వర్మ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

నల్లజర్ల: రాష్ట్ర యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న నల్లజర్లలో పూర్వ పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి జట్టును ఎంపిక చేయనున్నట్టు సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్‌ఏ ఆర్కే వర్మ తెలిపారు. ఈ జట్టు రాష్ట్ర స్థాయి పోటీలకు వెళుతుందని చెప్పారు. స్థానిక కింగ్స్‌ఉడ్ స్కూలులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఇక్కడ జరిగే పోటీల్లో తొలి నాలుగు స్థానాల్లో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా తరఫున రాష్ట్ర పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎనిమిదేళ్ల నుంచి 45 ఏళ్ల వారు కూడా పాల్గొనవచ్చన్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయన్నారు. యోగా అసోసియేషన్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ ఇయర్‌గా పరిగణించి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. మరిన్ని వివరాలకు సంఘ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌ను 94408 67370 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో కింగ్స్ ఉడ్ స్కూలు చైర్మన్ దాపర్తి శివ, డైరెక్టర్ దాపర్తి నిఖిల, ప్రిన్సిపాల్ డాక్టరు ఎ.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ

చెత్త పేరుకుపోవడంపై ప్రజల ఆగ్రహం


దేవరపల్లిలో ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో పేరుకున్న చెత్త

దేవరపల్లి: పారిశుధ్య పరిస్థితులు క్షీణిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు సీజనల్ వ్యాధులతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలు.. పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తితో రగిలిపోతున్నారు. రేపోమాపో నగర పంచాయతీ స్థాయికి ఎదగనున్న దేవరపల్లిలో పారిశుధ్య నిర్వహణ లోపించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల పక్కన ఎక్కడపడితే అక్కడ చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డులో చెత్త పేరుకుపోవడంతో, ఆయా కార్యాలయాలకు వెళుతున్న ప్రజలు, అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంత మార్కెట్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ప్రధాన రహదారిలో చెత్త గుట్టలుగా ఉంది. గ్రామంలో చెత్త కుప్పలను వెంటనే తొలగించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

పంటలకు ఎరువులతో మేలు


పెరవలిలో వరి చేనుకు ఎరువులు వేస్తున్న రైతులు

పెరవలి: ఖరీఫ్ సాగు ఈ ఏడాది కష్టాలతో ప్రారంభమై రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అతివృష్టి, అనావృష్టి అన్నట్టుగా వాతావరణ పరిస్థితులు నెలకొనడం.. పంటలకు శ్రేయస్కరం కాదని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. నిడదవోలు నియోజకవర్గ పరిధిలో 36, 500 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా, పెరవలి మండలంలో 8,500 ఎకరాలు, ఉండ్రాజవరంలో 11,500, నిడదవోలు మండలంలో 16,500 ఎకరాల్లో వరినాట్లు వేశారు. ఖరీఫ్ పంటకు సంబంధించి నియోజకవర్గంలో ఎరువులు పుష్కలంగా ఉన్నాయని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం వరినాట్లు వేసిన చేలు 20 రోజుల నుంచి 35 రోజుల వయస్సు కలిగి ఉన్నాయని, పంటపై ఎటువంటి తెగుళ్లు, చీడపీడలు సోకలేదని వారు తెలిపారు.

ఎరువుల యాజమాన్య పద్ధతులు

తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు పొందడానికి ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి మేరీ కిరణ్ తెలిపారు. ఎకరం వరిచేనుకు మొదటి దఫా కోటాలో అరబస్తా పొటాష్, 20–20 లేదా డీఏపీ బస్తా, యూరియా అర బస్తా వేయాలని చెప్పారు. వరి చేలపై అగ్గి తెగులు ఆశిస్తే.. నివారణ కోసం 120 గ్రాముల ట్రైసైక్లోజోల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులు అధిక మోతాదులో ఎరువులు వినియోగించడం వల్ల ఎటువంటి ఉపయోగం లేదని చెప్పారు. ఊడ్చిన 40 రోజుల వరకు తెగుళ్ల నివారణకు ఎటువంటి పురుగు మందులను పిచికారీ చేయవద్దని సూచించారు. 40 రోజుల తర్వాత క్లోరాంట్రా నిలిప్రోల్ గుళికలను ఎకరానికి 4 కిలోల చొప్పున వేస్తే ఊసపోటు నివారించవచ్చని వివరించారు.

చెరువు గట్టు మలుపు.. ప్రమాదాలకు పిలుపు

- దుర్ఘటనలకు గురవుతున్న ప్రజలు
- ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలు


ప్రమాదకరంగా పల్లంట్ల రాతి చెరువు గట్టు రోడ్డు మలుపు

దేవరపల్లి: పల్లంట్ల–దేవరపల్లి రోడ్డులోని రాతి చెరువు గట్టు రోడ్డు మలుపు అపాయకరంగా మారింది. మలుపు దాటాలంటే ప్రజలు వణికిపోతున్నారు. మలుపు వద్ద నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు, ఆటోలు, కార్లు మలుపు వద్ద ప్రమాదాలకు గురవుతున్నాయి. రోడ్డుకు ఆనుకుని చెరువు ఉండడం, రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు అల్లుకుపోవడంతో, ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో దేవరపల్లి నుంచి పల్లంట్ల వెళుతున్న ఉపాధ్యాయుడు అల్లూరి వెంకటేశ్వరరావు బైక్‌పై వెళుతుండగా, మలుపు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఇటీవల రాత్రి సమయంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో బైక్‌పై వెళుతున్న చాగల్లు మండలం చిక్కాలకు చెందిన ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో అటుగా వెళుతున్న పలువురు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేయించి, వారి స్వగ్రామానికి పంపించారు. మలుపు వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, మలుపు వద్ద ముళ్ల పొదలను తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు అధికారులను కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారికి తీవ్ర గాయాలు


గాయాలతో చికిత్స పొందుతున్న చిన్నారి

నిడదవోలు: పట్టణంలో చర్చిపేట ప్రభుత్వాస్పత్రి వద్ద ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల బత్తుల రత్నం అనే చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక సంత మార్కెట్ వీధిలో నివసిస్తున్న బత్తుల కనకయ్య, చిట్టమ్మ దంపతులు తమ చిన్నారి రత్నంను తీసుకుని గణపతి సెంటర్‌లో ఉన్న మార్కెట్‌కు బైక్‌పై బయలుదేరారు. ఆస్పత్రి ప్రధాన రోడ్డు మలుపు వద్ద గణపతి సెంటర్ నుంచి వచ్చిన కారు వేగంగా వారి మోటార్ బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న దంపతులతో పాటు, చిన్నారి కూడా కింద పడిపోయింది. దీంతో చిన్నారికి తీవ్ర గాయాలు కాగా, దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి రత్నం అక్కడ చికిత్స పొందుతోంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ సంఘటన స్థలం నుంచి కారును తీసుకుని పరారయ్యాడు.

కష్టపడే వారికి ఎప్పుడూ గుర్తింపు

మాజీ హోం మంత్రి తానేటి వనిత


మాజీ హోం మంత్రి వనితను కలసిన వైఎస్సార్ సీపీ నల్లజర్ల నాయకులు

నల్లజర్ల: పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, అందుకు వామిశెట్టి పరమేశ్వరరావు, పావనీకుమారి నిదర్శనమని మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ తానేటి వనిత అన్నారు. రాష్ట్ర సోషల్ మీడియా విభాగం కార్యదర్శిగా వామిశెట్టి పరమేశ్వరరావు, పబ్లిసిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా సింగరాజుపాలెం ఎంపీటీసీ వామిశెట్టి పావనీకుమారికి పార్టీ కేంద్ర కార్యాలయం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వీరిద్దరూ మాజీ మంత్రి వనితను కలసి కృతజ్ఞతలు తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా వనిత పార్టీ నాయకులకు రాఖీలు కట్టి తమ అనుబంధాన్ని చాటుకున్నారు. ఆమెను కలసిన వారిలో పార్టీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, మండల మహిళా అధ్యక్షురాలు యజ్జవరపు లక్ష్మిగాంధీ, జిల్లా కార్యదర్శి ముప్పిడి వెంకటరత్నం, సయ్యద్ మునాఫ్, పిచ్చుకుల ప్రసాద్, బళ్లనాని, ప్రత్తి శ్రీనుబాబు, పెనుమాక వెంకటరత్నం, ప్రత్తి మురళీకృష్ణ, జాలాది రవి, ప్రగడ వెంకటేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు శ్రీకాకుళపు ఆదిత్య, చిన్నీ నాగూయాదవ్, తాడిగడప శ్రీనివాసరావు, భీమడోలు వెంకటేశ్వరరావు, చిట్లా వెంకటేశ్వరరావు, చేబ్రోలు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణమే 'మానవత' లక్ష్యం

సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి



నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రామచంద్రారెడ్డి

నల్లజర్ల: ఆదర్శ విలువలు కలిగిన ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత సంస్థ లక్ష్యమని, ఆ దిశగా నూతన కమిటీ సభ్యులు సేవా కార్యక్రమాలు అమలు చేయాలని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నల్లజర్లలోని ఓ ఫంక్షన్ హాలులో 2025–26 సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు మానవత సంస్థకు ఎంపికైన నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వమానవాళి శాంతియుతంగా ఉండాలనే ఆలోచనతో దేవుడు ఈ లోకాన్ని సృష్టించాడన్నారు. నేడు లోకంలో ఎక్కడ చూసినా అశాంతి నెలకొని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణం మానవుడి అజ్ఞానమన్నారు. దీనిని రూపుమాపడానికి సభ్యులు కృషి చేయాలన్నారు. 2004 ఆగస్టు 22న ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో కేవలం పది మంది సభ్యులతో ప్రారంభమైన ఈ సంస్థ.. నేడు 80 వేల సభ్యులతో 95 మండలాలకు విస్తరించి, నిత్యం వివిధ రకాల సేవా కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రజలకు సేవ చేయడంతో పాటు, వారి ఆలోచన విధానంలో మార్పులు తీసుకురావాలన్నారు. సాయం అందుకున్న వారు, తిరిగి మరి కొంతమందికి సాయం అందిస్తూ సమాజ సేవ చేయాలన్నారు. సంస్థ సేవా కార్యక్రమాలు గుర్తించి, చాలా మంది దాతలు అనేక రకాలుగా సాయం అందిస్తున్నట్టు చెప్పారు. కాగా సంస్థ అధ్యక్షుడిగా కండెపు వెంకట సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా వాసిబోయిన చంద్రయ్య, కార్యదర్శిగా భోగవల్లి వెంకటసుబ్బారావు, కోశాధికారిగా పుప్పాల గోపి దుర్గారాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శిగా కాకర్ల వినాయకంతో రామచంద్రారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


కొవ్వూరులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తాళ్లపూడి(కొవ్వూరు): స్నేహితుల దినోత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థులు పాతికేళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–2001 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కొవ్వూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆనాటి మధుర స్మృతులను వారు నెమరు వేసుకున్నారు. ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన స్నేహితులు పాతికేళ్ల తర్వాత ఓచోట చేరి, బాల్య జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: ఆర్‌డీడీఎస్ పనుల కోసం 33/11 కేవీ రామన్నపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ రూరల్ ఫీడర్‌పై సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు(ఆపరేషన్స్) ఈఈ ఎస్.నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. ధుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

ఆర్యవైశ్యులు అభివృద్ధి సాధించాలి

చాగల్లు: ఐక్యంగా ఉండి ఆర్యవైశ్యులంతా అన్ని విధాలా అభివృద్ధి సాధించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీరామమూర్తి అన్నారు. స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఆదివారం ఆర్యవైశ్యుల మండల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథి శ్రీరామమూర్తి మాట్లాడుతూ, ఆర్యవైశ్యులు సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. సంఘ నూతన మండల అధ్యక్షుడిగా పెంజర్ల ఉమ్మాజీ, కార్యదర్శిగా చిక్కాల గ్రామానికి చెందిన పి.శ్రీనివాస్, కోశాధికారిగా ఊనగట్ల గ్రామానికి చెందిన నారాయణ సత్యనారాయణతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్రంధి రాంబాబు, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఈసీసీ సభ్యులు చీమకుర్తి ప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తనపై కేసు

నిడదవోలు రూరల్: వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు ఆదివారం తెలిపారు. మండలంలోని జీడిగుంట గ్రామానికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన ఊబా సీతయ్య కొంతకాలంగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఆమెకు అతడు అసభ్యకర రీతిలో సైగలు చేశాడు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

దేవరపల్లి: మండలంలోని లక్ష్మీపురంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురిని అరెస్ట్ చేసి, రూ.14,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బీఎన్ నాయక్ తెలిపారు.